

http://amaravathivelugu.com

RNI No. : APTEL/2022/85169

అమరావతి తెలుగు

సంచలన తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను

పాత్రికేయులుగా పని చేయాలన్న ఉత్సాహం
మీ ప్రాంత స్థితిగతులపై అవగాహన
తెలుగులో రాయగలిగిన భాషా పరిజ్ఞానం ఉన్న
ఔత్సాహికులకు ఇదే మా ఆహ్వానం

అనంతపురం జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల్లో
న్యూస్ కంట్రిబ్యూటర్లు కావలెను.
విషయ పరిజ్ఞానంతో పాటు సామాజిక,
రాజకీయ అవగాహన కలిగి స్థానికులై ఉండాలి.
వివరాలకు సంప్రదించండి :
జానపాటి వెంకట రమేష్ బాబు ఎడిటర్
9440814576

సంపుటి : 04 సంచిక : 179 ప్రచురణ : శ్రీ సత్యసాయి/అనంతపురం ఎడిటర్ : జానపాటి వెంకట రమేష్ బాబు శుక్రవారం, అక్టోబరు 30, 2026 పేజీలు : 4 వెల : ₹2/-

Circulated at Guntur, Palnadu, Bapatla, Chittoor, Tirupati, Madanapalli, Kurnool, Nandyal, Visakapatnam, Vijayawada, Kadikana, Kadapa, Nellore, Rajamendravaram



సైబర్ మోసాల్లో బాధితులకు బ్యాంకులే...

పరిహారం చెల్లించాలి

- మోసాల్లో నష్టపోయిన వారికి బ్యాంకుల ద్వారానే పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలి
- మోసాలను అరికట్టడంలో బ్యాంకుల పాత్ర అత్యంత కీలకం
- పోలీస్ స్టేషన్లను అప్రమత్తం చేయడం బ్యాంకుల ప్రాథమిక బాధ్యతని ధర్మాసనం వెల్లడి
- అనుమానాస్పద లావాదేవీల కారణంగా ఖాతాదారులు తమ సొమ్మును కోల్పోకుండా చర్యలు

సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: డిజిటల్ సైబర్ మోసాల బాధితులకు ఊరట కల్పించే దిశగా సుప్రీంకోర్టు కీలక చర్యలకు ఉపక్రమించింది. డిజిటల్ మోసాల్లో బాధితులు కోల్పోయిన నగదుకు బ్యాంకులే బాధ్యత వహించేలా నిబంధనలు తీసుకురావాలని తేల్చి చెప్పింది. ఇలాంటి మోసాల్లో నష్టపోయిన వారికి బ్యాంకుల ద్వారానే పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. డిజిటల్ లావాదేవీల పేరుతో జరుగుతున్న మోసాలను అరికట్టడంలో బ్యాంకుల పాత్ర అత్యంత కీలకమని విచారణ సందర్భంగా ఉన్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. ఖాతాల్లో జరిగే అసాధారణ లావాదేవీలను గుర్తించి,

..2వ పేజీలో



తెలంగాణలో డేటా సెంటర్లకు ప్రత్యేక అగ్నిమాపక భద్రతా

మార్గదర్శకాలు జారీ

- డేటా సెంటర్లలో అగ్నిప్రమాదాల నివారణకు ఫైర్ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది
- ఫైర్ ఎన్ఓసీ దరఖాస్తుల వేగవంతమైన పరిష్కారానికి కొత్త నిబంధనలు విధించింది
- నవంబర్ 6వ తేదీ నుంచి సమర్పించే తాత్కాలిక ఫైర్ ఎన్ఓసీ దరఖాస్తులకు కొత్త మార్గదర్శకాలు
- సర్వర్లు, బ్యాటరీలు, యూపీఎస్, ట్రాన్స్‌ఫార్మర్ల భద్రతకు ప్రత్యేక చర్యలు
- డేటా సెంటర్లలో ఫైర్ అలారాలు, అగ్నిమాపక వ్యవస్థలు తప్పనిసరి చేసింది
- భద్రతతో పాటు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశం

హైదరాబాద్ : రాష్ట్రంలోని డేటా సెంటర్లకు ప్రత్యేక అగ్నిమాపక భద్రతా మార్గదర్శకాలను తెలంగాణ ప్రభుత్వం జారీ చేసింది. డేటా సెంటర్లలో అగ్నిప్రమాదాల నివారణకు ఫైర్ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఫైర్ ఎన్ఓసీ దరఖాస్తుల వేగవంతమైన పరిష్కారానికి కొత్త నిబంధనలు విధించింది. నవంబర్ 6వ తేదీ నుంచి సమర్పించే తాత్కాలిక ఫైర్ ఎన్ఓసీ దరఖాస్తులకు కొత్త మార్గదర్శకాలు వర్తింపజేస్తున్నట్లు

..2వ పేజీలో

ఆర్నబ్ తుఫాన్ నష్టపరిహారంపై చంద్రబాబు...

కీలక ఆదేశాలు..!!


క్షేత్రస్థాయిలో సాధారణ పరిస్థితి నెలకొనేంత వరకు విశ్రమించొద్దు

- కొన్ని ప్రాంతాలు మినహా మిగిలిన తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో సాధారణ స్థితి నెలకొంది
- తుఫాన్ నష్టంపై ఇవాళ ప్రాథమిక నివేదికను అందిస్తాం..: అధికారులు వెల్లడి
- పంట నష్టం మినహా బాధితులందరికీ నష్టపరిహారాన్ని అందించే పనిని వేగవంతం చేయాలి
- అధికార యంత్రాంగం పనితీరు అద్భుతం..విపత్తుల సమయంలో ప్రజలకు అండగా ఉండాలి
- ఏపీలో ప్రస్తుతం విభిన్నమైన వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి...
- రాయలసీమ ప్రాంతంలో ఎల్‌నినో ప్రభావంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి
- ఈ విషయంలో అధికార యంత్రాంగం సమర్థవంతంగా వ్యవహరించి ప్రజలను ఆదుకోవాలి
- పక్కా ప్రణాళికతో ఈ ప్రకృతి విపత్తుల బారీ నుంచి ప్రజలను బయటపడేయాలి
- ఆర్నబ్ తుఫాన్ వల్ల ప్రాణ, ఆస్తి నష్టం వీలైనంత మేర తగ్గించేలా చూశాం..
- చెరువులు, కాల్వలకు గండ్లు పడకుండా జాగ్రత్తలు తీసుకున్నాం
- రేపటిలోగా అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలి : ఏపీ సీఎం చంద్రబాబు

2లో

అమరావతి : ఆర్నబ్ తుఫాన్‌పై ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు ఈరోజు(గురువారం) టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షేత్రస్థాయిలో సాధారణ పరిస్థితి నెలకొనేంత వరకు విశ్రమించొద్దని ఇప్పటికే అధికార యంత్రాంగానికి సీఎం సూచనలు చేశారు. కొన్ని ప్రాంతాలు మినహా మిగిలిన తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో సాధారణ స్థితి నెలకొంది. ఈ క్రమంలో తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లోని క్షేత్రస్థాయి పరిస్థితులు, పునరుద్ధరణ పనులపై వివిధ శాఖల అధికారులు, జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తుఫాన్ నష్టంపై ఇవాళ ప్రాథమిక నివేదికను అందిస్తామని చంద్రబాబుకు అధికారులు తెలిపారు. పంట నష్టం మినహా బాధితులందరికీ నష్టపరిహారాన్ని అందించే పనిని వేగవంతం చేయాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు.





అధికార యంత్రాంగం పనితీరు అద్భుతం.. ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలకు అండగా ఉండాలని సీఎం తెలిపారు. ఆర్నబ్ తుఫాన్ సమయంలో అధికార యంత్రాంగం అద్భుతంగా పని చేసిందని కొనియాడారు. ఏపీలో ప్రస్తుతం విభిన్నమైన వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయని.. రాయలసీమ ప్రాంతంలో ఎల్‌నినో ప్రభావంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. ఇక మిగిలిన ప్రాంతాల్లో ఆర్నబ్ తుఫాన్ వల్ల సమస్యలు ఉత్పన్నమైనట్లు తెలిపారు. ఈ రెండింటి విషయంలో అధికార యంత్రాంగం సమర్థవంతంగా వ్యవహరించి ప్రజలను

ఆర్నబ్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో...

ప్రత్యేక టాస్క్‌ఫోర్స్..!!

పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు

- ఆర్నబ్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలి
- అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి
- ఆరోగ్యపరమైన ఇబ్బందులు తలెత్తకుండా పారిశుద్ధ్య పనులను వేగవంతం చేయాలి
- ఆర్నబ్ తుఫాన్ ప్రభావం.. కాకినాడలో ముగ్గురు మత్స్యకారుల గల్లంతు..
- ప్రజారోగ్యానికి ఎలాంటి ముప్పు వాటిల్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి
- నీటి నాణ్యత పరీక్షల కోసం 48 మంది అందుబాటులో సాంకేతిక సిబ్బంది
- ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

2లో



అమరావతి : ఆర్నబ్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచి.. అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. తుపాను కారణంగా ప్రభావితమైన ప్రాంతాల్లో ప్రజలకు ఆరోగ్యపరమైన ఇబ్బందులు తలెత్తకుండా పారిశుద్ధ్య పనులను వేగవంతం చేయాలని సూచించారు. **ఆర్నబ్ తుఫాన్ ప్రభావం.. కాకినాడలో ముగ్గురు మత్స్యకారుల గల్లంతు...** ఇందులో భాగంగా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశారు. తొమ్మిది జిల్లాల నుంచి మొత్తం 475 మంది సిబ్బందిని ఈ బృందాల్లో నియమించారు. తుపాను ప్రభావం ఉన్న ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తుపాను అనంతరం ప్రజారోగ్యానికి ఎలాంటి ముప్పు వాటిల్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంపై ప్రభుత్వం దృష్టి సారించింది.

..2వ పేజీలో

ఏరియల్ వ్యూ ద్వారా..

పంటల పరిశీలన..!!

- తుఫాన్ సహాయక పర్యవేక్షణకు త్వరలో ఎస్ఓపీ విధానం తెస్తాం
- ఆర్నబ్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో నష్టపోయిన బాధితులను అన్నివిధాలా ఆదుకుంటాం
- బాధితులను అన్నివిధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు..
- తుఫాన్‌ను అనుక్షణం పర్యవేక్షించంతో ప్రాణనష్టం తగ్గింది..
- తుఫాన్ బాధితులు ఆందోళన చెందవద్దని ధైర్యం చెప్పారు..
- ఏపీలో ఆర్నబ్ తుఫాన్ ప్రభావం దారుణంగా ఉంది..
- ఆర్నబ్ తుఫాన్ బాధిత రైతులతో సీఎం చంద్రబాబు ముఖాముఖి
- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

2లో


అమరావతి : ఆర్నబ్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో నష్టపోయిన బాధితులను అన్నివిధాలా ఆదుకుంటామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భరోసా కల్పించారు. బాధితులను అన్నివిధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. తుఫాన్‌ను అనుక్షణం పర్యవేక్షించంతో ప్రాణనష్టం తగ్గిందని వ్యాఖ్యానించారు. తుఫాన్ బాధితులు ఆందోళన చెందవద్దని ధైర్యం చెప్పారు. ప్రభావిత ప్రాంతాల్లో ఈరోజు (గురువారం) ఏరియల్ వ్యూ ద్వారా ఆయా ప్రాంతాల్లోని పంటలను సీఎం పరిశీలించారు. పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో ముఖ్యమంత్రి పరిశీలించి అధికారుల నుంచి వివరాలు అడిగి



తెలుసుకున్నారు. **ఏరియల్ వ్యూ ద్వారా పంటల పరిశీలన..** ఏరియల్ వ్యూ పర్యటనలో భాగంగా తొలుత అమరావతి నుంచి సీఎం బయలుదేరి కాట్రేనికోన మండలం చెయ్యేరుకు చేరుకున్నారు. మార్గం మధ్యలో

ఆర్నబ్ తుఫాన్ నష్టపరిహారంపై చంద్రబాబు కీలక ఆదేశాలు..!!

(మొదటిపేజీ తరువాయి) ఆదుకోవాలని ఆదేశించారు. రాయలసీమలో పంటలు వేసుకునే పరిస్థితి లేదని అన్నారు. ఉత్తరాంధ్ర, కోస్తా, గోదావరి జిల్లాల్లో వేసుకున్న పంటలను, కొబ్బరి చెట్లను నష్టపోయిన దుస్థితి నెలకొందన్నారు. పక్కా ప్రణాళికతో ఈ ప్రకృతి విపత్తుల బారీ నుంచి ప్రజలను బయటపడేయాలని తెలిపారు. ఆర్నబ్ తుఫాన్ వల్ల ప్రాణ, ఆస్తి నష్టం వీలైనంత మేర తగ్గించేలా చూశామని చెప్పుకొచ్చారు. చెరువులు, కాల్వలకు గండ్లు పడకుండా జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. పడిపోయిన చెట్లను ఇప్పటికే చాలా వరకు తొలగించామని.. ఇంకా ఎక్కడైనా పడిపోయిన చెట్లు రోడ్లపై ఉంటే వాటిని వెంటనే తొలగించాలని ఆదేశించారు.



రేపటిలోగా విద్యుత్ పునరుద్ధరణ.. తుఫాన్ కారణంగా పోగైన చెత్తను కూడా తీసేయాలని అధికారులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. రేపటిలోగా అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలన్నారు. నష్ట పరిహారానికి సంబంధించిన అంశాలపై జీవో జారీ చేశామని.. పంట నష్టం మినహా బాధితులకు నష్టపరిహారం అందించాలని తెలిపారు. త్వరగా తుఫాన్ నష్టంపై అంచనాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. నీట మునిగిన పంటలను ఏ మేరకు కాపాడగలమో చూడాలన్నారు. దీనిపై వ్యవసాయ అధికారు లు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు అధ్యయనం చేయాలని అన్నా రు. పంట మట్టిపాలు కాకుండా ఎలాంటి చర్యలు తీసుకో వచ్చో ఆలోచించాలన్నారు. కొబ్బరి చెట్లు సహా వివిధ ఉద్యాన పంటలకు చెందిన చెట్లు, మొక్కలను తిరిగి ప్లాంట్ చేయగ లిగే పరిస్థితులు ఉన్నాయా అనే అంశాన్నీ పరిశీలించాలని సూచించారు. తుఫాన్ బాధిత వ్యవసాయ, ఉద్యాన రైతులకు వాటిల్లిన నష్టాన్ని భర్తీ చేయడానికి వివిధ స్కీంలను వర్తింపజేయాలన్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో సాధారణ స్థితి నెలకొనేంత వరకు ప్రభుత్వ యంత్రాంగం అండగా నిలవాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం చేసే పనుల ను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలపాలని.. అప్పుడే ప్రజల నుంచి సహకారం లభిస్తుందన్నారు. త్వరితగతిన పంట న ష్టం అంచనాలను సిద్ధం చేసేందుకు టెక్నాలజీని వినియోగిం చాలని టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

ఆర్నబ్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో...

ప్రత్యేక టాస్క్‌ఫోర్స్..!!

(మొదటిపేజీ తరువాయి) డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి జిల్లా లకు ప్రత్యేకంగా 100 టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశారు. తుపాను ప్రభావిత ప్రాంతా ల్లో తాగునీటి నాణ్యతను పరిశీలించేందుకు ప్రత్యేక వాటర్ టెస్టింగ్ బృందాలను కూడా నియమించారు. ఈ రెండు జిల్లాల్లో నీటి నాణ్యత పరీక్షల కోసం 48 మంది సాంకేతిక సిబ్బందిని అందుబాటులో ఉంచారు. తాగు నీటి ద్వారా వ్యాధులు వ్యాపించకుండా నీటి నాణ్యతను పరీక్షించడం, పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగుపరచడం వంటి చర్యలకు ఈ బృందాలు ప్రాధాన్యం ఇవ్వనున్నాయి. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు నెలకొనేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. ప్రజారోగ్య పరిరక్షణకు అవసరమైన చర్యలను వేగంగా అమలు చేయాలని స్పష్టం చేశారు.

సైబర్ మోసాల్లో బాధితులకు బ్యాంకులే

పరిహారం చెల్లించాలి

(మొదటిపేజీ తరువాయి) వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్లను అప్రమత్తం చేయడం బ్యాంకుల ప్రాథమిక బాధ్యతని ధర్మాసనం పేర్కొంది. అనుమానాస్పద లావాదేవీల కారణంగా ఖాతాదారులు తమ సొమ్మును కోల్పోకుండా రక్షణ చర్యలు చేపట్టాలని



సూచించింది. ఈ ఏడాది డిజిటల్ నేరాలు 50 శాతం తగ్గినప్పటికీ, బాధితులు రూ.800 కోట్లు కోల్పోవడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. 'డిజిటల్ అరెస్ట్' పేరుతో అమాయకులను భయపెట్టి డబ్బులు వసూలు చేస్తున్న సైబర్ నేరాలపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టింది. ఈ కేసులో జోక్యం చేసుకునేందుకు వాట్సాప్ సంస్థకూ అనుమతి ఇచ్చింది. ఈ సందర్భంగా ఇప్పటివరకు 9,400 అనుమానాస్పద ఖాతాలను నిషేధించినట్లు ఉన్నత న్యాయస్థానానికి వాట్సాప్ వెల్లడించింది. మరోవైపు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) డిసెంబర్ 31 నుంచి తీసుకురానున్న కేవైసీ (KYC) సవరణ మార్గదర్శకాలనూ పరిశీలించాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. ఈ మేరకు మార్గదర్శకాలు వర్తించే బ్యాంకుల జాబితాను సమర్పించాలని ఆర్‌బీఐని ఆదేశించింది. నూతన మార్గదర్శకాలు అమలు కానుండటంతో డిజిటల్ అరెస్ట్ మోసాల నియంత్రణలో వాటి ప్రాధాన్యంపై సుప్రీంకోర్టు దృష్టి సారించింది.

ఏపీలో రేషన్ కార్డు ఉన్నవారికి భారీ గుడ్ న్యూస్..

ప్రభుత్వం నుంచి దీపావళి గిఫ్ట్.. పండుగే పండుగ

మీకు రేషన్ కార్డు ఉందా..? అయితే దీపావళి పండక్కి గుడ్ న్యూస్. ప్రభుత్వం చౌక ధరకే నిత్యావసర సరుకులుఅందించనుంది. దీపావళి కానుకగా వీటిని అందించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. బహిరంగ మార్కెట్లో ధరలు ఎక్కువగా ఉండటంతో.. తక్కువ ధరకే ప్రభుత్వం అందించనుంది. రేషన్ షాపుకు వెళ్లి వీటిని తీసుకోవచ్చు.



ఏపీలో రేషన్ కార్డు ఉన్నవారికి భారీ గుడ్ న్యూస్. కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రేషన్ కార్డుదారులకు దీపావళి గిఫ్ట్ ప్రకటించింది. దీపావళి కానుకగా ప్రజలకు అతి తక్కువ ధరకే నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని సీఎం చంద్రబాబు తాజాగా కీలక ఆదేశాలు జారీ చేశారు. రేషన్ షాపుల ద్వారా బియ్యంతో పాటు కందిపప్పు, గోధుమ పిండి, పామాయిల్ అతి తక్కువ ధరకే సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అందించనున్నారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావం వల్ల పంట ఉత్పత్తి తగ్గిపోవడంతో బయట మార్కెట్లలో నిత్యావసర సరుకుల ధరలు భారీగా పెరుగుతున్నాయి. దీంతో సామాన్యులకు ఇది భారంగా మారగా.. ఇంటి బడ్జెట్ పెరుగుతోంది. పండుగ సందర్భంగా ఇంట్లోకి కిరాణా సరుకుల అవసరం ఎక్కువగా ఉంటుంది. పెరిగిన ధరలతో వీటిని కొనాలంటే సామాన్యులకు పెనుభారం మారుతున్నాయి.

రేషన్ షాపుల్లో చౌక ధరకే నిత్యావసర సరుకులు.. ఈ క్రమంలో దీపావళి సందర్భంగా రేషన్ షాపుల్లో కందిపప్పు, గోధుమ పిండి, పామాయిల్ అందించాలని చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు సబ్సిడీ ధరలను కూడా ఫిక్స్ చేశారు. కిలో కందిపప్పు రూ.100కు అందించనుండగా.. గోధుమ పిండి రూ.25, పామాయిల్ లీటర్ రూ.125కే ఇవ్వనున్నారు. టెండర్ల ద్వారా పామాయిల్ సేకరించి ప్రభుత్వం పంపిణీ చేయనుంది. దీంతో పాటు ఫైన్, సూపర్ ఫైన్ రకం బియ్యంను కూడా ప్రభుత్వం తక్కువ ధరకు అందించనుంది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో సన్నబియ్యం కిలో రూ.100 పలుకుతోంది. దీంతో మొబైల్ వాహనాల ద్వారా ధరణి బ్రాండ్‌తో కిలో పైన్ బియ్యాన్ని రూ.49, సూపర్ ఫైన్ బియ్యాన్ని రూ.50కే విక్రయించనున్నారు. ఇప్పటికే రైతు బజార్లలో సన్నబియ్యంను ప్రజలకు తక్కువ ధరకు ప్రభుత్వం అందిస్తోంది. అలాగే కిలో ఉల్లిని రూ.35కే పంపిణీ చేస్తోంది. త్వరలో 800 టన్నులు ఉల్లిని కూడా సబ్సిడీ ధరలకు అందించనుంది.

బీపీటీ బియ్యం రూ.66కే పంపిణీ... బీపీటీ స్టీమ్ రైస్ బియ్యం కిలో రూ.66, సాధారణ స్టీమ్ రకం బియ్యం రూ.47కి మించకుండా విక్రయించేలా మిల్లర్ల, హోల్ సేల్ అసోసియేషన్లతో ప్రభుత్వ అధికారులు చర్చించారు. దీంతో మిల్లర్లు దీనికి అంగీకరించారు. తాజాగా ఏపీలోని నిత్యావసర సరుకుల ధరలపై చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బియ్యం అక్రమంగా తరలిపోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇందుకోసం చెక్ పోస్టులు, టోల్ గేట్ల వద్ద నిఘా పెంచాలని సూచించారు. అలాగే మార్కెట్ సెస్సు భారాన్ని తగ్గించే విధంగా చూడాలన్నారు. దీపావళి రానున్న క్రమంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

ఏరియల్ వ్యూ ద్వారా పంటల పరిశీలన..!!

(మొదటిపేజీ తరువాయి) ఏరియల్ వ్యూ ద్వారా ఆర్నబ్ తుఫాన్ వల్ల నష్టపోయిన వరిచేలు, అరటి, కొబ్బరి తోటలు, ఆక్వా చెరువులను ముఖ్యమంత్రి పరిశీలించి, రైతులకు భరోసా కల్పించారు. ఏరియల్ వ్యూ ద్వారా కృష్ణా, పశ్చిమ గోదావరి, కోనసీమ ప్రాంతాల్లో తుఫాన్ ప్రభావాన్ని పరిశీలించారు. నిమ్మకూరు, పామర్రు, బంటుమిల్లి, నరసాపురం, పాలకొల్లు, అమలాపురం, కాట్రేనికోన ప్రాంతాల్లో నీట మునిగిన పొలాలను, కూలిన కొబ్బరి చెట్లను పరిశీలించి అన్నదాతలతో మాట్లాడారు. ఏయే ప్రాంతాల్లో ఏ మేరకు నష్టం జరిగిందనే అంశాలను సీఎం చంద్రబాబుకు.. తన సెక్రటరీ ప్రద్యుమ్న వివరించారు.

ఏపీలో ఆర్నబ్ తుఫాన్ ప్రభావం దారుణంగా ఉంది.. ఏపీలో ఆర్నబ్ తుఫాన్ ప్రభావం దారుణంగా ఉందని సీఎం చంద్రబాబు తెలిపారు. చెట్లు ఎక్కడా కూడా రోడ్డుకు అడ్డంగా లేకుండా వేగంగా కట్ చేసి క్లియర్ చేశామని తెలిపారు. జనరేటర్లు పెట్టాలని చెప్పినా కొందరు అధికారులు ఆ పని చేయలేదని.. దానివల్ల కొంత ఇబ్బంది వచ్చిందని అన్నారు. కోనసీమలో 8వేల విద్యుత్ స్తంభాలు పడిపోయాయని చెప్పారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో కరెంట్ సరఫరా పునరుద్ధరిస్తామని తెలిపారు. తెలంగాణ, తమిళనాడు నుంచి విద్యుత్ సిబ్బందిని పిలిపించి రెండు రోజుల్లో చివరి ప్రాంతం వరకు కరెంట్ అందిస్తామని చెప్పారు. తుఫాన్ సహాయక పర్యవేక్షణకు త్వరలో ఎస్ఓపీ విధానాన్ని తెస్తామని అన్నారు.



రాష్ట్రంలో తుఫాన్‌కు రూ.6500 కోట్ల నష్టం జరిగిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నుంచి తుఫాన్ నష్టం అంచనా బృందాలు వస్తాయని.. అవసరమైతే కోనసీమకు మళ్లీ తాను వస్తానని మాటిచ్చారు. పంటలకు భీమా చేయించడంతో నష్ట పరిహారం వస్తుందని చెప్పారు. తుఫాన్ క్రాస్ అయ్యే సమయంలో 35,000 మంది అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లో తాను పాల్గొన్నానని తెలిపారు. తీర ప్రాంత మండలాల్లో విద్యుత్ కేబుల్స్ అండర్ గ్రౌండ్‌లో వేస్తే నష్టం తగ్గించవచ్చని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

రైతులతో సీఎం చంద్రబాబు ముఖాముఖి.. వేట్లపాలెంలో ఆర్నబ్ తుఫాన్ బాధిత రైతులతో సీఎం చంద్రబాబు ముఖాముఖి నిర్వహించారు. నీట మునిగిన పొలాలను ఆయన పరిశీలించారు. అధికారులు చేపడుతున్న సహాయక చర్యలు సంతృప్తికరంగా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. తుఫాన్‌పై తమ ప్రభుత్వం వెంటనే వేగంగా స్పందించిందని ముఖ్యమంత్రి అన్నారు. స్థానికంగా ఉన్న ఉద్యోగులు తమకు సూచనలను అందించారని స్థానికులు తెలిపారు. 15 రోజుల్లో కోతకు వచ్చే దశలో సాగు ఉండగా తుఫాన్ రావడంతో నష్టపోయామని.. దిగుబడి పడిపోతుందని సీఎం దృష్టికి స్థానిక రైతులు తీసుకువచ్చారు. పంటల బీమా చేయించారా..?, లేదా..? అని స్థానిక అధికారులను ముఖ్యమంత్రి అడిగారు. చేయించామని అధికారులు తెలిపారు. దెబ్బతిన్న కొబ్బరి చెట్లను పరిశీలించారు. మువ్వ మొత్తం రాలిపోయిందని దీని వల్ల నష్టం ఎక్కువగా ఉంటుందని కొబ్బరి రైతన్నలు ఆవేదన వ్యక్తం చేశారు. 1996లో హరికేన్ తుఫాన్ సమయంలో చంద్రబాబు ముమ్మిడివరంలో హెలీకాప్టర్‌తో రోడ్డ మీద ల్యాండైన విషయాన్ని స్థానిక రైతులు గుర్తు చేశారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు తమ ప్రాంత వాసులకు ముందుగా చంద్రబాబే గుర్తుకువస్తారని స్థానికులు వివరించారు. సీఎం చంద్రబాబు పర్యటనలో మంత్రి అచ్చెన్నాయుడు, స్థానిక ప్రజా ప్రతినిధులు, కోనసీమ జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.

సంపాదకీయం

తుఫాను ప్రభావిత రాష్ట్రాలకు అండగా కేంద్రం..

త్వరలోనే పరిశీలనకు కేంద్ర బృందాలు

అర్నబ్ తుఫాను సృష్టించిన బీభత్సంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరి, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రులతో మాట్లాడి, కేంద్రం నుంచి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. త్వరలో కేంద్ర బృందాలు నష్టాన్ని అంచనా వేసి ఆర్థిక సహాయం అందిస్తాయన్నారు.



అర్నబ్ తుఫాను సృష్టించిన బీభత్సం, దాని ప్రభావిత ప్రాం తాల్లోని పరిస్థితులపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఉన్నత స్థాయి సమీక్ష నిర్వ హించారు. ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరి, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులతో అమిత్ షా ఫోన్ లో మాట్లాడారు..ఆయా రాష్ట్రాల్లో నమోదైన నష్టం, చేపడుతున్న రక్షణ చర్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రం నుంచి పూర్తి సహకారం అందిస్తామని,ఈ విపత్కర సమయంలో బాధిత రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని అమిత్ షా హామీ ఇచ్చారు. విపత్తు నిర్వహణ, రక్షణ , పునరావాస పనుల నిమిత్తం కేంద్రం నుంచి అవసరమైన అన్ని రకాల సాంకేతిక, ఆర్థిక సహాయ సహకారాలను తక్షణమే అందిస్తామని స్పష్టం చేశారు.

యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్న సహాయక చర్యలు.. తుపాను ధాటికి ప్రభావితమైన జిల్లాల్లో జాతీయ విపత్తు స్పందన దళం, రాష్ట్ర విపత్తు స్పందన దళం బృందాలు క్షేత్రస్థాయిలో రంగంలోకి యుద్ధ ప్రాతిపదికన సహాయక కార్యక్రమాలు చేపట్టాయి. రోడ్లపై కూలిపోయిన చెట్లను, విద్యుత్ స్తంభాలను తొలగించి రవాణాను పునరుద్ధరిస్తున్నారు.విద్యుత్ సరఫరా, మంచినీటి వసతులను త్వరితగతిన సరిదిద్దేందుకు అధికారులు వేగంగా పనులు చేపడుతున్నారు.లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు.

త్వరలోనే పరిశీలనకు కేంద్ర బృందాలు... తుపాను కారణంగా సంభవించిన పంట నష్టం, ఆస్తి నష్టం మౌలిక వసతుల ధ్వంసం తీవ్రతను ప్రత్యక్షంగా అంచనా వేసేందుకు త్వరలోనే కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక బృందాలు ఆయా రాష్ట్రాల్లో పర్యటిస్తాయని అమిత్ షా ముఖ్యమంత్రులకు తెలిపారు. కేంద్ర బృందాలు సమర్పించే నివేదిక ఆధారంగా రాష్ట్రాలకు అదనపు ఆర్థిక సాయం విడుదల చేయనున్నట్లు తెలిపారు..ప్రకృతి విపత్తుల వేళ ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాలను కనిష్టానికి తగ్గించడమే తమ ప్రాధాన్యమని, బాధిత కుటుంబాలకు కేంద్రం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హోంమంత్రి పునరుద్ఘాటించారు.

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం..

తుఫాన్‌గా మారుతుందా..?

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడిందని APSDMA వెల్లడించింది. ఇది రానున్న 24 గంటల్లో మరింత స్పష్టమైన అల్పపీడనంగా, ఆ తర్వాత వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని తెలిపింది. దీని ప్రభావంతో నవంబర్ 1, 2 తేదీల్లో కోస్తాంధ్రలో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది.



బంగాళాఖాతంలో మరో వాతావరణ వ్యవస్థ చురుగ్గా మారుతోంది. దక్షిణ అండమాన్ సముద్రం, పరిసర ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (APSDMA) వెల్లడించింది. రానున్న 24 గంటల్లో ఇది పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ మరింత స్పష్టమైన అల్పపీడనంగా మారే అవకాశం ఉందని తెలిపింది. ఆ తర్వాత మరో 24 గంటల్లో ఆగ్నేయ బంగాళాఖాతం, అండమాన్ సముద్ర ప్రాంతాల్లో వాయుగుండంగా బలపడే అవకాశముందని పేర్కొంది.

నవంబర్ 1, 2 తేదీల్లో వర్షాలు... ఈ వాతావరణ వ్యవస్థ ప్రభావంతో నవంబర్ 1, 2 తేదీల్లో కోస్తాంధ్రలో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. ముఖ్యంగా తీర ప్రాంతాల్లో వాతావరణ మార్పులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. అయితే వర్షాల తీవ్రత, ప్రభావిత ప్రాంతాలపై రానున్న రోజుల్లో మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

తుఫాన్‌గా మారుతుందా?... ప్రస్తుతం అల్పపీడనంగా ఉన్న ఈ వ్యవస్థ మరింత బలపడి వాయుగుండంగా మారే అవకాశాలను వాతావరణ నిపుణులు పరిశీలిస్తున్నారు. ఇది తుఫాన్‌గా మారుతుందా? ఏ దిశగా కదులుతుంది? తీర ప్రాంతాలపై ఎలాంటి ప్రభావం చూపుతుంది? అనే అంశాలపై ఇప్పుడే స్పష్టమైన అంచనాకు రావడం సాధ్యం కాదు. తాజా వాతావరణ బులెటిన్ల ఆధారంగా పరిస్థితిపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఇటీవల అర్నబ్ తుఫాన్ కారణంగా ఏర్పడిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో మరో అల్పపీడనం ఏర్పడటం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే కొత్తగా ఏర్పడిన వ్యవస్థ తప్పనిసరిగా తుఫాన్‌గా మారుతుందని చెప్పలేం. అది ఎంత బలపడుతుంది, ఏ దిశగా కదులుతుంది, తీర ప్రాంతాలపై ఎలాంటి ప్రభావం చూపుతుంది అన్నది రానున్న వాతావరణ పరిణామాలే నిర్ణయిస్తాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన ఈ అల్పపీడనంపై APSDMA ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని అందిస్తోంది. ప్రజలు అధికారిక వాతావ రణ హెచ్చరికలను గమనిస్తూ, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు

తెలంగాణలో డేటా సెంటర్లకు ప్రత్యేక అగ్నిమాపక భద్రతా

మార్గదర్శకాలు జారీ

(మొదటిపేజీ తరువాయి) స్పష్టం చేసింది. సర్వర్లు, బ్యాటరీలు, యూపీఎస్, ట్రాన్స్‌ఫార్మర్ల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. డేటా సెంటర్లలో ఫైర్ అలారాలు, అగ్నిమాపక వ్యవస్థలు తప్పనిసరి చేసింది. టెక్నికల్ విభాగాల్లో వాటర్ మిస్ట్ లేదా క్లీన్ ఏజెంట్ గ్యాస్ ఫైర్ సప్రెషన్ వ్యవస్థలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అగ్నిప్రమాద వ్యాప్తిని అడ్డుకునే విభజనలు, అత్యవసర మార్గాలు, అగ్నిమాపక నీటి నిల్వలు తప్పనిసరి చేసింది. మండే స్వభావం ఉన్న ప్యాకింగ్ సామగ్రి, వ్యర్థాలు పేరుకుపోకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఫైర్ సేఫ్టీ వ్యవస్థలను భవన నిర్వహణ, అత్యవసర స్పందన వ్యవస్థలతో అనుసంధానం చేయాలని సూచించింది. భద్రతతో పాటు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించింది. కీలక డిజిటల్, మౌలిక సదుపాయాల రక్షణ, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే సన్నద్ధతే లక్ష్యమని తెలంగాణ సర్కార్ స్పష్టం చేసింది.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో
పటిష్ఠ భద్రత

గోరంట్ల, అక్టోబరు 29,అమరావతి వెలుగు :స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా ఎస్పీ ఎస్. సతీష్‌కుమార్









అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం గోరంట్లలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలతో పాటు మందలపల్లిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల నిఘా, శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న ముందస్తు చర్యలను పరిశీలించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని, పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో గోరంట్ల సీఐ శేఖర్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పుట్టపర్తిలో కూటమి ఎన్నికల
సమరభేరి

పుట్టపర్తి, అక్టోబరు 29, అమరావతి వెలుగు : పుట్టపర్తి మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో కూటమి నాయకులు నేడు భారీ ర్యాలీ, పాదయాత్ర నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు విద్యాగిరి ఆర్చ్ వద్ద ప్రారంభమయ్యే ఈ కార్యక్రమం చిత్రావతి బ్రిడ్జి వరకు కొనసాగనుంది. మాజీ మంత్రి, పుట్టపర్తి



నియోజకవర్గ ఇన్‌చార్జి పల్లె రఘునాథ్‌రెడ్డి, అహుడా చైర్మన్ టి.సి. వరుణ్ పాల్గొననున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా పట్టణంలో ఎన్నికల ప్రచారాన్ని మరింత ఉధృతం చేయనున్నారు. పట్టణ అభివృద్ధి, ప్రజా సంక్షేమం, మౌలిక సదుపాయాల కల్పన అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు వివిధ ప్రాంతాల్లో ప్రజలను కలుసుకుని మద్దతు కోరనున్నారు. ఈ ర్యాలీకి తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పిలుపునిచ్చింది. నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరింది.

సున్నపుగుట్ట తండాలో వైసీపీ అభ్యర్థులకు
మద్దతుగా ప్రచారం

కదిరి, అక్టోబరు 29, అమరావతి వెలుగు : మండలంలోని సున్నపుగుట్ట తండాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులకు మద్దతుగా వైసీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఎస్ఈసీ) సభ్యుడు, రాయదుర్గం నియోజకవర్గ పరిశీలకుడు డాక్టర్ బత్తల హరిప్రసాద్ గురువారం ఎన్నికల



ప్రచారం నిర్వహించారు. వైసీపీ జడ్పీటీసీ అభ్యర్థి వజ్ర భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ అభ్యర్థి వెంకటేష్ నాయక్‌లను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైసీపీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అభ్యర్థుల విజయాన్ని పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యులు అల్లాబకాష్, వెంకటేష్, నవాజ్, హరి, మాజీ కౌన్సిలర్ ఖతీబ్ షబ్బీర్, కాంట్రాక్టర్ బాబా, యేసు, జాకీర్, కిరణ్‌తో పాటు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటు హక్కు పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించాలి

కదిరి, అక్టోబరు 29, అమరావతి వెలుగు : ప్రజాస్వామ్య పరిరక్షణకు, ఓటు హక్కు సంరక్షణకు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఏఐసీసీ పరిశీలకులు డాక్టర్ బెల్లయ్య నాయక్ తేజావత్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు కె.ఎన్. షానవాజ్ ఆధ్వర్యంలో కదిరిలో గురువారం 'ఓట్ బచావో -- దేశ్ బచావో' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆయన దిశానిర్దేశం చేశారు. డాక్టర్ బెల్లయ్య నాయక్ తేజావత్ మాట్లాడుతూ ఓటు హక్కు పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ఉద్యమ సందేశాన్ని ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని సూచించారు. దేశంలో ఓట్ల చోరీ జరుగుతోందంటూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 2024 ఎన్నికల సందర్భంగా ఓట్ల చోరీ జరిగిందన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో చంద్రబాబు నాయుడు, నరేంద్ర మోదీల పాత్రపై విచారణ జరపాలని కాంగ్రెస్ పార్టీ తరపున కోరారు. ప్రజాస్వామ్యానికి, భారత రాజ్యాంగానికి



విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే కాంగ్రెస్ పార్టీ ప్రశ్నిస్తుందని పేర్కొన్నారు. ప్రజల ఓటు హక్కును, రాజ్యాంగ హక్కులను, ప్రజాస్వామ్య విలువలను కాపాడటమే పార్టీ లక్ష్యమని తెలిపారు. నవంబరు 1న ఢిల్లీలో రాహుల్ గాంధీ నాయకత్వంలో నిర్వహించనున్న 'చలో ఢిల్లీ -- ఓట్ బచావో, దేశ్ బచావో' కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణను కోరుకునే వారు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ ఓటు హక్కు ప్రాధాన్యాన్ని ప్రజలకు వివరించాలని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పార్టీ చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. 2029లో రాహుల్ గాంధీ నాయకత్వంలో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీసీసీ కోఆర్డినేటర్ ఇర్ఫాన్ బాషా, పట్టణ అధ్యక్షుడు అల్లాబకష్, జడ్పీటీసీ అభ్యర్థులు బాబు, రామిరెడ్డి, సురేంద్ర నాయక్, శ్రీనివాసులు, నాగేంద్ర, డీసీసీ ఉపాధ్యక్షుడు నాగభూషణ, జిల్లా ప్రధాన కార్యదర్శి గౌస్ బాషా, ఎంపీటీసీ అభ్యర్థులు ప్రసాద్ నాయి, సురేష్, డీసీసీ కార్యదర్శి సుజాత్ ఖాన్, అనుబంధ సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జేసీ పవన్‌కుమార్‌రెడ్డికి ఘన స్వాగతం

పుట్టపర్తి, అక్టోబరు29, అమరావతి వెలుగు : సత్యసాయి బాబా దర్శనార్థం పుట్టపర్తికి విచ్చేసిన జేసీ పవన్‌కుమార్‌రెడ్డికి గురువారం పుట్టపర్తి విమానాశ్రయంలో నాయకులు,



అభిమానులు ఘన స్వాగతం పలికారు. విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి ఆహ్వానించారు. పలువురు నాయకులు మర్యాదపూర్వక ంగా కలిసి అభివాదం చేశారు. ఆయన రాకతో అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. ఈ కార్యక్రమంలో జేసీ ముఖ్య అనుచరుడు నిషార్ అహ్మద్, పెద్దన్న, పుట్టపర్తి బీజేపీ పట్టణ అధ్యక్షుడు కళ్యాణ్‌కుమార్, మున్సిపాలిటీ 26వ వార్డు బీజేపీ కౌన్సిలర్ అభ్యర్థి కుసుమ జయరాం, న్యాయవాది హరికృష్ణ, రామ్, లక్ష్మణ్, షామీర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి
:టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎల్ఐసీ నరసింహులు

నల్లమాడ, అక్టోబరు29,అమరావతి వెలుగు : కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను అత్యధిక



మెజార్టీతో గెలిపించాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎల్ఐసీ నరసింహులు ఓటర్లను అభ్యర్థించారు. పుట్టపర్తి నియోజక వర్గంలోని నల్లమాడ మండలం కురుమాల గ్రామం, చౌటు కుంట పల్లిలో గురువారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. కూటమి తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఎల్ఐసీ నరసింహులు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన, అర్హులైన వారికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడం వంటి అంశాలను ప్రజలకు వివరించాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాప్రతినిధుల ఎంపిక గ్రామాల అభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు. నల్లమాడ మండలంలో కూటమి తరపున పోటీ చేస్తున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులకు ప్రజలు మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. ఎంపీటీసీ అభ్యర్థి కురుమాల చిన్న భాష, జడ్పీటీసీ అభ్యర్థి సోమ్లా నాయక్‌లను సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లో నెలకొన్న స్థానిక సమస్యలను పరిష్కరించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజల సహకారం అవసరమన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి ఎన్నికల ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కురుమాల, చౌటుకుంటపల్లి గ్రామాల్లో నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో ఎంపీటీసీ అభ్యర్థి చిన్న భాషతో పాటు టీడీపీ నాయకులు, కూటమి నేతలు పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి కూటమి అభ్యర్థులకు ఓటు వేయాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చైర్మన్ పీఠమే లక్ష్యం..
పుట్టపర్తిలో ప్రచార హోరు

పుట్టపర్తి, అక్టోబరు 29, అమరావతి వెలుగు : మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని దక్కించుకోవడమే లక్ష్యంగా పుట్టపర్తిలో ఎన్నికల ప్రచారం హోరెత్తుతోంది. వార్డువార్డునా అభ్యర్థుల పర్యటనలు.. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను ప్రసన్నం చేసుకునే ప్రయత్నాలు.. అభివృద్ధి హామీలతో ప్రజల్లోకి వెళ్తున్న నాయకులు.. ఇలా పట్టణంలో ఎన్నికల సందడి నెలకొంది. జనసేన పార్టీ తరపున కూటమి చైర్మన్ అభ్యర్థి మేకల ఈశ్వర్, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బోయ వసం అవినాష్ గెలుపే లక్ష్యంగా ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఇరువురికి మద్దతుగా ప్రధాన నాయకులు రంగంలోకి దిగడంతో మున్సిపల్ ఎన్నికల పోరు ఆసక్తికరంగా మారింది. కూటమి అభ్యర్థి మేకల ఈశ్వర్ తరపున మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. వివిధ వార్డుల్లో పర్యటిస్తూ ప్రజలను నేరుగా కలుసుకుని జనసేన పార్టీ గాజు గుర్తుకు ఓటు వేసి ఈశ్వర్‌ను గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. పట్టణంలో గతంలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని ఈశ్వర్ ప్రచారంలో ప్రస్తావిస్తున్నారు. తనకు అవకాశం కల్పిస్తే తాగునీరు, డ్రైనేజీ, రహదారుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తానని హామీ ఇస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకొచ్చి దశలవారీగా అభివృద్ధి పనులు చేపడతానని, పుట్టపర్తిని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. మరోవైపు వైఎస్సార్‌సీపీ చైర్మన్ అభ్యర్థి బోయ వసం అవినాష్ కూడా ప్రచారంలో జోరు పెంచారు. మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఆయనకు మద్దతుగా వార్డుల్లో పర్యటిస్తూ ప్రజలను ఓట్లు అభ్యర్థిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ అవినాష్‌కు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. తనకు అవకాశం కల్పిస్తే పట్టణంలో తాగునీరు, డ్రైనేజీ, వీధి దీపాల సమస్యలను పరిష్కరిస్తానని అవినాష్ హామీ ఇస్తున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సెల్ ఏర్పాటుకు కృషి చేస్తానని చెబుతున్నారు. ప్రతి వార్డులో 'గుడ్ మార్నింగ్' కార్యక్రమం నిర్వహించి ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని పేర్కొంటున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే పుట్టపర్తి మున్సిపాలిటీని అగ్రస్థానంలో నిలపడమే తన లక్ష్యమని వివరిస్తున్నారు.







అభివృద్ధి హామీలే ప్రచార అస్త్రాలు... చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకోవడమే లక్ష్యంగా ఇరు పార్టీల అభ్యర్థులు వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నారు. తాగునీరు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ, రహదారులు, వీధి దీపాల సమస్య పరిష్కారం ప్రధాన ప్రచారాంశాలుగా మారాయి. ఒకవైపు కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరిస్తూ కూటమి నేతలు ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తుండగా, మరోవైపు గత ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రస్తావిస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం సాగిస్తున్నారు. ప్రధాన నాయకుల పర్యటనలు, అభ్యర్థుల ఇంటింటి ప్రచారంతో పట్టణంలోని రాజకీయ వాతావరణం వేడెక్కింది. చైర్మన్ పీఠాన్ని ఎవరు దక్కించుకుంటారన్న అంశంపై స్థానికంగా ఆసక్తి నెలకొంది.

స్ట్రాంగ్ రూమ్ భద్రతలో అప్రమత్తంగా ఉండాలి: డీఎస్పీ మాణిక్యరావు







పుట్టపర్తి, అక్టోబరు 29, అమరావతి వెలుగు :

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బ్యాలెట్ బాక్సుల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని పుట్టపర్తి సబ్ డివిజనల్ పోలీసు అధికారి (డీఎస్పీ) సి. మాణిక్యరావు సూచించారు. పట్టణంలోని చిన్నపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల స్ట్రాంగ్ రూమ్‌ను గురువారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులుతో కలిసి ఆయన పరిశీలించారు. బ్యాలెట్ బాక్సులను భద్రపరిచే గది వద్ద భద్రతా ఏర్పాట్లు, పోలీసు సిబ్బంది విధులు, పర్యవేక్షణ చర్యలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. నవంబరు 1న జరగనున్న మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని స్ట్రాంగ్ రూమ్ భద్రతకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని డీఎస్పీ ఆదేశించారు. బ్యాలెట్ బాక్సులు భద్రపరిచిన ప్రాంతంలో నిరంతర నిఘా కొనసాగించాలని, విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తూ భద్రతా విధులు నిర్వహించాలన్నారు. పటిష్ఠ నిఘా.. పక్కా భద్రత స్ట్రాంగ్ రూమ్ వద్ద విధులు నిర్వహించే సిబ్బంది నిర్దేశిత భద్రతా విధానాలను కచ్చితంగా పాటించాలని డీఎస్పీ సి. మాణిక్యరావు స్పష్టం చేశారు. విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని, అనుమానాస్పద కదలికలు గుర్తిస్తే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. పోలీసు, మున్సిపల్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ బ్యాలెట్ బాక్సుల భద్రతను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా సాగేందుకు అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో స్ట్రాంగ్ రూమ్ భద్రత కీలకమని, బ్యాలెట్ బాక్సుల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డీఎస్పీ మాణిక్యరావు సూచించారు. ఈ తనిఖీల్లో పుట్టపర్తి అర్బన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ యువరాజ్, పోలీసు సిబ్బంది, మున్సిపల్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్, స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేసిన జేసీ







బుక్కపట్నం, అక్టోబరు 29, అమరావతి వెలుగు : స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావులేకుండా అన్ని ఏర్పాట్లను పక్కాగా చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్ అధికారులను ఆదేశించారు. గురువారం బుక్కపట్నం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్‌లు, ఎన్నికల సామగ్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్నికల సామగ్రి, బ్యాలెట్ బాక్సులు, పోస్టల్ బ్యాలెట్ పత్రాల భద్రతను పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ల పంపిణీ, స్వీకరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా పక్కాగా రికార్డులు నిర్వహించాలని సూచించారు. విధులు నిర్వహించే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ వినియోగంలో ఇబ్బందులు లేకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలు, మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. స్ట్రాంగ్ రూమ్‌లు, పోస్టల్ బ్యాలెట్ కేంద్రాల వద్ద పటిష్ఠ భద్రత కల్పించడంతోపాటు సీసీ కెమెరాల నిఘా నిరంతరం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, మండల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. ఈ తనిఖీల్లో జెడ్పీ సీఈవో వెంకట సుబ్బయ్య, డిప్యూటీ సీఈవో, తహసీల్దార్, ఎంపీడీవో, రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరు అభివృద్ధికి...
రూ.80 కోట్లకు పైగా ఖర్చు

ఆత్మకూరు, అక్టోబరు 29, అమరావతి వెలుగు : కూటమి ప్రభుత్వానిది అభివృద్ధి మార్క్ పాలన కాగా.. వైకాపా పాలనలో అరాచకం చోటుచేసుకుందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఆత్మకూరు మండల కేంద్రంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులతో కలిసి ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ఆత్మకూరు మండల ప్రజలు తనకు మంచి మెజారిటీ ఇచ్చి గెలిపించారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకునేలా అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. మండలంలో రెండేళ్లలో రూ.80 కోట్లకు పైగా నిధులతో అంతర్గత రహదారులు, బీటీ రోడ్లు, వాటర్ ప్లాంట్లు, సచివాలయాలు, విద్యుత్తు సబ్‌స్టేషన్ల నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. ఆత్మకూరు పంచాయతీలో డ్వాక్రా సంఘాలకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా రూ.12.71 కోట్లు అందించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో రహదారుల అనుసంధానానికి రూ.200 కోట్లు వెచ్చించామని, అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.136 కోట్లు, డ్రిప్, స్ప్రింక్లర్ల సబ్సిడీకి రూ.68 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. తల్లికి వందనం పథకానికి రూ.110 కోట్లు కేటాయించామని, ఆత్మకూరు మండలంలో తాగునీటి సమస్య పరిష్కారానికి జలజీవన్ మిషన్ ద్వారా సీపీడబ్ల్యూఎస్ పథకానికి రూ.35 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఉపాధి కల్పన, పారిశ్రామిక అభివృద్ధి కోసం రూ.330 కోట్లతో పరిశ్రమ, రూ.109 కోట్లతో ఎంఎస్ఎంఈ పార్కు, రామగిరిలో 300 మెగావాట్ల సౌర విద్యుత్తు ప్లాంటు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. గ్రామాల అభివృద్ధి కొనసాగాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలని సునీత కోరారు. ప్రచారంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎన్నికల రోజున వేతనంతో కూడిన సెలవు

అనంతపురం, అక్టోబరు 29, అమరావతి వెలుగు : అర్బన్ స్థానిక సంస్థల సాధారణ ఎన్నికలు జరిగే ప్రాంతాల్లోని దుకాణాలు, వాణిజ్య సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులకు నవంబరు 1న వేతనంతో కూడిన సెలవు ప్రకటించినట్లు జిల్లా ఉప కార్మిక కమిషనర్ లక్ష్మీ నరసయ్య తెలిపారు. ఆంధ్రప్రదేశ్ షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం--1988 ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నట్లు గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు గుత్తి, తాడిపత్రి, గుంతకల్లు, కళ్యాణదుర్గం, రాయదుర్గం మున్సిపాలిటీల పరిధిలో ఈ ఆదేశాలు అమలులో ఉంటాయని వివరించారు. రాష్ట్ర కార్మిక శాఖ కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఆయా ప్రాంతాల్లోని దుకాణాలు, వాణిజ్య సంస్థల యాజమాన్యాలు తమ ఉద్యోగులు, కార్మికులకు ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా వేతనంతో కూడిన సెలవు కల్పించాలని సూచించారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో ఉద్యోగులు, కార్మికులు భాగస్వాములై స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా యాజమాన్యాలు సహకరించాలని లక్ష్మీ నరసయ్య కోరారు.

31న ఉదయం 6 గంటలకే ఎన్నికల...
పంపిణీ కేంద్రాలకు చేరుకోవాలి

పుట్టపర్తి, అక్టోబరు29, అమరావతి వెలుగు : మున్సిపల్ ఎన్నికల విధులకు నియమితులైన ప్రిసైడింగ్ అధికారులు (పీఓలు), సహాయ ప్రిసైడింగ్ అధికారులు (ఏపీఓలు), ఇతర పోలింగ్ అధికారులు (ఓపీఓలు) ఈ నెల 31న ఉదయం 6 గంటలకల్లా సంబంధిత మున్సిపాలిటీల్లోని ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలకు చేరుకోవాలని జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. నవంబరు 1న జరగనున్న పోలింగ్ నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావులేకుండా విధులు నిర్వర్తించాలని సూచించారు. గురువారం మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించి పలు ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల సామగ్రి పంపిణీ, విధుల నిర్వహణకు సంబంధించి అధికారులు, సిబ్బంది ముందస్తు సన్నద్ధతతో ఉండాలని సూచించారు. నిర్దిష్ట సమయానికి పంపిణీ కేంద్రాలకు చేరుకుని తమకు కేటాయించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.




దివ్యాంగులకు సదరమ్..
వైద్య పరీక్షలకు అనుమతి

అనంతపురం, అక్టోబరు 29, అమరావతి వెలుగు : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సదరమ్ ధ్రువీకరణ పత్రాల జారీ కోసం దివ్యాంగులకు వైద్య పరీక్షలు నిర్వహించేందుకు సాధారణ సదరమ్ స్లాట్ల విడుదలకు రాష్ట్ర ఎన్నికల సంఘం అనుమతి ఇచ్చినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఈ నెల 24న ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. సదరమ్ ధ్రువీకరణ పత్రాలు లేని అర్హులైన దివ్యాంగులు వైద్య పరీక్షల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. దివ్యాంగులకు వైద్య పరీక్షలు నిర్వహించడం సాధారణ పరిపాలనా కార్యక్రమంలో భాగమని రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసిందని తెలిపారు. అయితే, ఎన్నికల ప్రవర్తనా నియమావళికి ఎలాంటి భంగం కలగకుండా సంబంధిత నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించినట్లు పేర్కొన్నారు. సదరమ్ ధ్రువీకరణ పత్రాలు లేని అర్హులైన దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. వైద్య పరీక్షల ప్రక్రియలో అర్హులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సదరమ్ ధ్రువీకరణ పత్రాల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రయోజనాలు, వివిధ సేవలు పొందేందుకు అర్హులైన దివ్యాంగులకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ ప్రక్రియను సంబంధిత అధికారులు నిబంధనల మేరకు నిర్వహించాలని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు పేర్కొన్నారు.

పాఠశాలల సమీపంలో 306 చోట్ల రోడ్డు భద్రతా...
చర్యలు చేపట్టాలి: కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పుట్టపర్తి , అక్టోబరు 29, అమరావతి వెలుగు : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. పాఠశాలల సమీపంలో విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని, జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల పరిసరాల్లో గుర్తించిన 306 ప్రాంతాల్లో రోడ్ సైనేజీలు, స్పీడ్ బ్రేకర్లు, రోడ్ మార్కింగ్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. గురువారం పుట్టపర్తి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా రోడ్డు సేఫ్టీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించగా, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. పంచాయతీ రహదారులు ప్రధాన రహదారులు, జాతీయ రహదారులతో కలిసే ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు అవసరమైన చోట్ల స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు, రహదారి సూచికలు, మార్కింగ్స్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. వాహనదారులకు ముందుగానే ప్రమాద సూచనలు తెలిసేలా తగిన చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా పాఠశాలల సమీపంలో విద్యార్థులు రహదారులు దాటే ప్రాంతాలను గుర్తించి భద్రతా ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ సూచించారు. పోలీసు, వైద్య ఆరోగ్య శాఖలతో



పాటు సంబంధిత శాఖల అధికారులు ఇ-డార్ (e-DAR) వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించాలని తెలిపారు. నమోదు, సమాచార సవరణకు సంబంధించి సందేహాలుంటే ఇన్‌ఛార్జి సోఫియా నాయక్‌ను సంప్రదించి పరిష్కరించుకోవాలని సూచించారు. జాతీయ రహదారులపై ప్రతి 40 కిలోమీటర్లకు పెట్రోలింగ్ వాహనాలను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు ఎన్‌హెచ్ఏఐ అధికారి శ్రావణ్ కుమార్ సమావేశంలో వివరించారు. పెట్రోలింగ్ వాహనాల కదలికలు, వాటి పనితీరుకు సంబంధించిన వివరాలను నెల వారీగా సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. రహదారులపై ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఇసుక, కంకర తరలించే టిప్పర్లలోని సరుకును టార్పాలిన్ వస్త్రంతో పూర్తిగా కప్పి ఉంచాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సరుకు రహదారులపై పడకుండా, ఇతర వాహనదారులకు ప్రమాదం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయం, సహకారంతో పనిచేస్తే జిల్లాలో రోడ్డు ప్రమాదాలను, ప్రాణనష్టాన్ని గణనీయంగా తగ్గించవచ్చని కలెక్టర్, ఎస్పీ పేర్కొన్నారు. రహదారి భద్రతపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు ప్రమాదాల నివారణకు నిరంతరం చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

నగర అభివృద్ధికి వైకాపాను
గెలిపించండి

అనంతపురం, అక్టోబరు 29, అమరావతి వెలుగు : అనంతపురం నగరంలో రెండున్నరేళ్లుగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో దోపిడీ పాలన సాగుతోందని వైకాపా జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. నగరపాలక సంస్థ ఎన్నికల్లో వైకాపా అభ్యర్థులను గెలిపిస్తే ప్రజలకు అండగా ఉంటామని తెలిపారు. గురువారం వైకాపా మేయర్ అభ్యర్థి రమేష్‌గౌడ్‌తో కలిసి నగరంలోని 61, 62, 60, 58వ డివిజన్లలో ప్రచారం నిర్వహించారు. కార్పొరేటర్ అభ్యర్థులు వాసంతి, బిందుప్రియ, సుజాత, భవాని తరఫున ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ 2019 నుంచి 2024 వరకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో సంక్షేమ పథకాలతోపాటు నగర అభివృద్ధికి ప్రాధాన్యమిచ్చామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని విమర్శించారు. నగరంలో కొత్త పింఛన్లు మంజూరు చేయలేదని, 1,300 పింఛన్లు తొలగించారని ఆరోపించారు. ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, 50 ఏళ్లకే పింఛను వంటి హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. నగర ప్రజలు ముందుచూపుతో ఆలోచించి ఓటు వేయాలని కోరారు. బీసీ వర్గానికి చెందిన విద్యావంతుడు రమేష్‌గౌడ్‌ను మేయర్ అభ్యర్థిగా నిలబెట్టామని, ఆయనతోపాటు అన్ని డివిజన్లలో వైకాపా కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వైకాపాకు అవకాశం కల్పిస్తే నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు.



ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించండి

వైసీపీ మేయర్ అభ్యర్థి చిట్టూరి రమేష్

అనంతపురం, అక్టోబరు 29, అమరావతి వెలుగు : అనంతపురం నగరపాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో పాతూరు కూరగాయల మార్కెట్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆ పార్టీ మేయర్ అభ్యర్థి చిట్టూరి రమేష్, 11వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి నసీమా మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్‌తో కలిసి వ్యాపారులు, స్థానిక ప్రజలను కలుసుకున్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తమ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మార్కెట్‌లోని వ్యాపారులతో మాట్లాడిన చిట్టూరి రమేష్ నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తామని తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణ, రహదారుల అభివృద్ధి, తాగునీటి సరఫరా వంటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. అనంతపురం నగర సమగ్ర అభివృద్ధి కోసం వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. 11వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి నసీమా మాట్లాడుతూ డివిజన్‌లోని ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. స్థానికుల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని పేర్కొన్నారు. ఈ ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.



వాటర్ సప్లయ్ స్కీమ్ కార్మికుల...
వేతన బకాయిలకు రూ.18 కోట్లు

ధర్మవరం, అక్టోబరు 29, అమరావతి వెలుగు : శ్రీ సత్యసాయి వాటర్ సప్లయ్ స్కీమ్ (ఎస్ఎస్‌వీఎస్ఎస్‌పీ)లో పనిచేస్తున్న కార్మికుల వేతన బకాయిల చెల్లింపునకు రాష్ట్ర ప్రభుత్వం రూ.18 కోట్లు మంజూరు చేసింది. రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ చొరవతో నిధుల విడుదలకు మార్గం సుగమమైంది. గత కొన్ని నెలలుగా జీతాలు అందక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కార్మికులకు ఈ నిర్ణయం ఊరటనివ్వనుంది. శ్రీ సత్యసాయి వాటర్ సప్లయ్ స్కీమ్ ద్వారా ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందించడంలో కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారు. విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ నెలల తరబడి వేతనాలు అందకపోవడంతో వారు, వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఈ సమస్యను గుర్తించిన మంత్రి సత్యకుమార్ యాదవ్ కార్మికులకు రావాల్సిన బకాయిల చెల్లింపుపై రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి నిధుల మంజూరుకు కృషి చేశారు. వేతన బకాయిల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రూ.18 కోట్ల నిధులు మంజూరయ్యేలా చర్యలు చేపట్టడంతో కార్మికుల్లో హర్షం వ్యక్తమవుతోంది. బకాయిల చెల్లింపుతో తమ ఆర్థిక ఇబ్బందులు కొంతమేర తగ్గుతాయని వారు ఆశిస్తున్నారు. ప్రజలకు తాగునీటి సేవలు అందించే కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది. మంత్రి సత్యకుమార్ యాదవ్ చొరవతో వేతన బకాయిల చెల్లింపునకు నిధులు మంజూరు కావడం కార్మికులకు ఊరటనిచ్చే అంశమని ఆయన కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.



Edited, Printed, Published & Owned by : JANAPATI VENKATA RAMESH BABU, #1-1189-21A, NGO Colony, KADIRI - 515591, Anantapuramu (Dist.), AP (State) and Printed at M/s AK PUBLICATIONS, #1-1189-2A, NGO Colony, Kadiri - 515591, Anantapuramu (Dist), AP (State) and Published at #1-1189-21A, NGO Colony, Kadiri - 515591, Anantapuramu (Dist.), (A.P), Editor : JANAPATI VENKATA RAMESH BABU, RNI No. APTEL / 2022 / 85169, E-mail : amaravathivelugu@gmail.com, Cell: 9440814576